# కారుకు ఓటేస్తేనే అభివృద్ధి

- రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి
- బొంరాస్‌పేట మండలంలోని ఏర్పుమళ్ల, దుద్యాల మండల కేంద్రంలో జోరుగా ఇంటింటి ప్రచారం



ఏర్పుమళ్లలో వృద్ధురాలికి ఈవీఎంలో ఓటు ఎలా వేయాలో చూపుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట, నవంబర్ 27 : అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రి డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలో ఏర్పుమళ్ల గ్రామంలో, దుద్యాల మండల కేంద్రంలో మంత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా ఈవీఎంను చూపించి కారు గుర్తుకు ఎలా ఓటు వేయాలో ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తును నిర్ణయించేవని, ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేస్తే అభివృద్ధి కుంటుపడి, సంక్షేమం ఆగిపోతుందని అని అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని అనేక హామీలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. ఆసరా పింఛన్ రూ.5 వేలకు పెంపు, రూ.400లకే గ్యాస్ సిలిండర్, సౌభాగ్యలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.3 వేల ఆర్థిక సహాయం, రూ.15 లక్షలతో కేసీఆర్ బీమా పథకం వంటి అనేక పథకాలను ఎన్నికల్లో గెలిచిన వెంటనే సీఎం కేసీఆర్ అమలు చేస్తారని ఓటర్లకు ఆయన వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోట్ల యాదగిరి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటమ్మ, సర్పంచ్ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుద్యాలలో మండల ఎన్నికల ఇన్‌చార్జ్ లింగంపల్లి కిషన్‌రావు, పార్టీ నాయకులు బసిరెడ్డి, కవిత, యూనుస్ తదితరులతో సమావేశమై ఎన్నికల ప్రచారాన్ని సమీక్షించారు. రెండు రోజులపాటు ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు.



పంచలింగాల్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

## దళితుల పక్షపాతి సీఎం కేసీఆర్

**మల్లికార్జునగిరి, పంచలింగాల్ గ్రామాలకు చెందిన దళితులు ముఖ్యమంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకాలు**

మర్పల్లి, నవంబర్ 27 : వికారాబాద్ నియోజకవర్గంలోని దళిత కుటుంబాలకు దళిత బంధు పథకాన్ని ఒకేసారి వర్తింపజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని హర్షిస్తూ మండలంలోని మల్లికార్జుగిరి, పంచలింగాల్ గ్రామాలకు చెందిన హరిజన కుటుంబాలు, దళిత సంఘాల నాయకులు సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మయ్య, యువనాయకుడు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ దళితుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని కొనియాడారు. బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధితోపాటు అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా ..రెండోసారి ఎమ్మెల్యేగా ఆనంద్‌ను కారుగుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించుకుని మరింత అభివృద్ధి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాందాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మొగులయ్య, సంజీవ్‌యాదవ్, ప్రవీణ్, ప్రకాశ్, బీఆర్ఎస్ శ్రేణులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మల్లికార్జునగిరిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం..



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ భారతి, అదనపు కలెక్టర్ ప్రతిమ

## పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళీకేరి**

ఇబ్రహీంపట్నం, నవంబర్ 27: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళీకేరి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజు, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కాగా రంగారెడ్డి జిల్లా నుంచి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి భారతి హోళీకేరి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఈసీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్‌లో భాగస్వామ్యం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రచారం ఈ నెల 28 సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందన్నారు. పోలింగ్ అనంతరం ఆ కేంద్రాల నుంచి ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించేందుకు వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలన్నారు. జిల్లాలో కంట్రోల్ రూంను ఏర్పాటుచేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి

ఎన్నికల విధుల్లో నియమించబడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళీకేరి సూచించారు. ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించిన కేంద్రాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటుచేసి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లోనూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 26వరకు జిల్లాలో 10,312 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసినట్లు చెప్పారు. ఇంకా వినియోగించుకోని వారు ఈ నెల 29న పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ఖరారుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతిలేకుండా పోలింగ్ రోజు (ఈ నెల 30న), పోలింగ్‌కు ముందురోజు (ఈ నెల 29న) ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించొద్దన్నారు.



## నేడు మద్దూర్‌కు మంత్రి హరీశ్‌రావు రాక

కొడంగల్, నవంబర్ 27: బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డికి మద్దతుగా రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు మంగళవారం మద్దూర్ మండలంలో పర్యటించి ప్రచారం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల కేంద్రంలోని కూడలిలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు.

# పోలింగ్‌కు అంతా సిద్ధం..

- నేటి సాయంత్రం 5 గంటల నుంచి ప్రచారం బంద్.. ఈనెల 30 వరకు జిల్లాలో 144 సెక్షన్ అమలు
- 30న ఉదయం 5.30 గంటల నుంచే మాక్ పోలింగ్..
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై పత్రిక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సాయంత్రం 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగుస్తుందని.. ఆ తర్వాత రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎక్కడా సమావేశాలు, ర్యాలీలు, వాహనాల ద్వారా ప్రచారం చేయొద్దన్నారు. నేడు సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 30 వరకు జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అదేవిధంగా పోలింగ్‌కు ముందు 48గంటల్లో ఎటిపరిస్థితుల్లోనూ సోషల్ మీడియా, పత్రికల్లో, ఎలక్ట్రానిక్ మీడియాలో చర్చలు, ఒపీనియల్ పోల్ తదితరాలను ప్రచారం చేయొద్దని.. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 9 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఉండగా, మరో 9 బృందాలు నేడు సాయంత్రం 5 గంటల నుంచి తనిఖీలను ముమ్మరం చేస్తాయన్నారు. ఈనెల 30న ఉదయం 5.30 గంటల నుంచి మాక్ పోల్ నిర్వహిస్తారని, మాక్ పోలింగ్‌లో భాగంగా 50 ఓట్లు వేసి, లెక్కింపు ప్రక్రియ చేపట్టి ఈవీఎంలను సరిచూస్తారన్నారు. తదనంతరం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఎవరూ ప్రచారం చేయొద్దని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేస్తే చర్యలు తప్పవని, సి-విజిల్ యాప్ లేదా 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, పుకార్లను ప్రచారం చేయొద్దన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులుగానీ, ఆయా పార్టీలకు సంబంధించిన వారు ఎవరూ ఓటర్లను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయొద్దని, జిల్లాలోని 602 లోకేషన్లలో వాహనాలను సిద్ధం చేశామని, దివ్యాంగులు అవసరమైన వారికి వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.




### బయటి వ్యక్తులు వెళ్లిపోవాలి : ఎస్పీ కోటిరెడ్డి

నేడు సాయంత్రం 5 గంటల్లోగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బయటి వ్యక్తులు వెళ్లిపోవాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరించారు. జిల్లాకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని.. నేడు హోటళ్లు, లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లలో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా జిల్లాలో 2500 మంది సిబ్బందితో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఈవీఎంలను తరలించేందుకు 555 లోకేషన్స్, 971 పోలింగ్ కేంద్రాలు, 84 రూట్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోలీసులు ఎక్కడైనా ఏ పార్టీకైనా పక్షపాతంగా వ్యవహరిస్తే డయల్ 100 లేదా సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు.